లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆదోని టౌన్: కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురైతే వెంటనే హెల్ప్ డెస్క్ నంబర్ 70325 75929కు సమాచారం అందించాలన్నారు. రాత్రి పూట వరద వస్తే ప్రజలు ఇబ్బంది పడకుండా దగ్గరలోని ప్రభుత్వ పాఠశాలలో ఆశ్రమం పొందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

బెల్లంఊట ధ్వంసం

ఆదోని రూరల్: ఆదోనిలోని అఫిసారాళ్ల కొండల్లో బుధవారం ఆదోని ఎక్సైజ్ పోలీస్, కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆదోని సివిల్ పోలీసుల సహకారంతో నాటుసారా స్థావరాలపై దాడులు చేశారు. దాడుల్లో 250 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 25 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్ తెలిపారు. పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన బోయ మురళిపై కేసు నమోదు చేసి జైలుకు తరలిస్తున్నట్లు చెప్పారు.

యూరియా ఇవ్వండి సారూ !

కౌతాళం: సార్ రైతులను ఆదుకోండి.. మీకు చేతులెత్తి మొక్కుతున్నాం.. అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు వేడుకున్నారు. మండలానికి తక్షణమే యూరియా ఇవ్వాలని కోరుతూ బుధవారం తహసీల్దారు రజినీకాంత్‌రెడ్డికి, మండల వ్యవసాయ అధికారి విజయరాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, ఎంపీపీ అమరేష్, ఏకాంబర్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, బసవప్రభు, సుధాకర్‌రెడ్డి మట్లాడుతూ.. కౌతాళం మండలంలో 25వేల హెక్టార్లల్లో వివిధ పంటలు సాగు చేసిన రైతులకు యూరియా లేక అవస్థలు పడుతున్నారన్నారు. ఏ పంటకైనా పంట వేసిన 45రోజుల్లోపు ఎరువులకు వేయాలని, కానీ ఇప్పటికే రెండు నెలలు కావస్తున్నా యూరియా అందడం లేదన్నారు. మొదటి విడతలో రైతులు ఎలాగోల ఎరువులు వేసుకున్నారని, రెండో విడతలో యూరియా అందకపోవడంతో ఎరువులు వేయలేకపోతున్నారన్నారు. అదును దాటిపోతోందని రెండు రోజుల నుంచి మంచి వర్షాలు పడ్డాయని ఈ విషయంపై జిల్లా కలెక్టర్, వ్యవసాయాధికారులు స్పందించి కౌతాళం మండలానికి న్యాయం చేయాలని వారు వేడుకున్నారు.



తహసీల్దార్ రజినీకాంత్‌రెడ్డికి వినతి పత్రాన్ని ఇస్తున్న నాయకులు

కౌతాళం మండలంపై వివక్ష..

కోడుమూరు మండలంలో 7వేల హెక్టర్లల్లో పంటలు సాగుచేస్తే 2,500మేట్రిక్ టన్నులు యూరియా ఇచ్చారని, కౌతాళం మండలంలో 25వేల హెక్టర్లల్లో పంట సాగు అయితే ఇప్పటి వరకు కేవలం 1000 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే అందిందన్నారు. ఇది ఎంత వరకు న్యాయం అని ప్రశ్నించారు. కౌతాళం మండలానికి రావాల్సిన 4500మేట్రిక్ టన్నుల యూరియాలో ఇప్పటి వరకు 25శాతం కూడ ఇవ్వక పోతే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా యూరియా పంపిణీ చేయాలని కోరారు. అదునుదాటిన తర్వాత యూరియా ఇస్తే ప్రయోజనం లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుజ్జీస్వామి, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, మాజీ సర్పంచ్ అవతారం, వెంకటరామిరెడ్డి, పలువురు పాల్గొన్నారు.





బుధవారం డోన్ పర్యటకు వచ్చిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వై.సీతారామిరెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, పార్టీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, బుట్టా శివనీలకంఠ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి





విద్యార్థినులు శక్తి యాప్ గురించి తెలుసుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ హేమలత

ఆదోని అర్బన్: విద్యార్థినులు శక్తి యాప్ గురించి తెలుసుకోవాలని ఆదోని డీఎస్పీ హేమలత అన్నారు. బుధవారం మండలంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థినులకు శక్తి యాప్, సైబర్ క్రైమ్స్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఎవరైనా విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, దూషించినా వెంటనే శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, బాల్యవివాహాలను నివారణకు కృషి చేయాలన్నారు. బాలికలు బాగా చదువుకుని ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తాలూకా సీఐ నల్లప్ప, ఎస్ఐ రామాంజనేయులు, శక్తి టీం స్టాఫ్ రాజేశ్వరి, పీసీ నాగరాజు, హెచ్ఎం రియాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ.. మోసాలతో సరి



బాబు మోసాలను గ్రామస్తులకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మంత్రాలయం రూరల్ : సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు ష్యూరిటీ అంతా మోసాలతో సరిపెడుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మండలంలోని చిలకలడోణ గ్రామంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లెల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలకు టీడీపీ ప్రభుత్వాల వైఫల్యాలను వివరించారు. అన్నదాతలకు అరకొరగా సుఖీభవ నిధులు మంజూరు చేయడం దారుణమన్నారు. మూడు విడతల్లో సుఖీభవ నిధులు ఇస్తామని రైతులను నిలువునా మోసం చేశారని దుయ్యబట్టారు. ప్రతి ఆడబిడ్డకు నెలనెలా రూ.1500 ఇస్తామని నేడు చేతులెత్తేయడం సరికాదన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో ఎక్కడా కూడా ప్రత్యేక గ్రాంటుతో పనులు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసేదెన్నడు?



బాబు మోసాలను ప్రజలకు తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఓట్ల కోసం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేదెన్నడో అని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, 21వ వార్డు నాయకులు సయ్యద్‌చాంద్ ప్రశ్నించారు. బుధవారం పట్టణంలోని 1, 21 వార్డుల్లో చంద్రబాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సీఎం చంద్రబాబునాయుడు ఏడాది పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చేసిన మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ చేనేత విభాగ రాష్ట్ర కార్యదర్శి మాచాని వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, సోమేష్, పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహులు, మైనారిటీ నియోజకవర్గ అధ్యక్షుడు ఖాశింబేగ్, జిల్లా ఉపాధ్యక్షుడు మహబుబ్‌బేగ్, పట్టణ అధ్యక్షుడు ముల్లా రసూల్, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూపించి సూపర్‌సిక్స్ అనండి



క్యూఆర్ కోడ్ పత్రాన్ని అందజేస్తున్న మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, నాయకులు

కౌతాళం: సీఎం చంద్రబాబు నాయుడు అభివృద్ధిని చూపించి సూపర్‌సిక్స్ అనాలని, ఎలాంటి అభివృద్ధి చేయకుండా ప్రచార ఆర్భాటం చేస్తున్నారే తప్ప ప్రజలకు చేసిందేమి లేదని వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ప్రహ్లాదాచారి, ఎంపీపీ అమరేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని హాల్వి, వల్లూరు, చూడి గ్రామాల్లో ఆయా గ్రామాల నాయకులు బసవప్రభు, చెన్నప్పధని, మరేగౌడ్, రమేష్, ఉప్పలప్పల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ...మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి క్యూఆర్ కోడ్‌తో బాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, వైస్ ఎంపీపీ బుజ్జీస్వామి, ఏకాంబర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, అబ్దుల్‌సమద్, అనిల్‌కుమార్, సర్పంచ్‌లు పాల్‌దినకర్, గోపాల్‌రెడ్డి, నర్సప్ప, గోవిందు, మాజీ సర్పంచులు అవతారం, రమేష్, రౌడూరు సుధాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మోసాల దిట్ట చంద్రబాబు



బాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: ప్రజలను మోసం చేయడంలో సీఎం చంద్రబాబు దిట్ట అని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అర్లబండ గ్రామంలో ఎంపీటీసీ గౌళ్ల తాయమ్మ, గ్రామ నాయకుడు పరుశురాముడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి క్యూఆర్ కోడ్‌ను అందజేస్తు బాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బెట్టన గౌడ, నాడుగేని నాగరాజు, బుళ్లి నరసింహులు, గానిగ వీరస్వామి, కాంట్రాక్టర్ నాగరాజు, ప్రతాప్, విజయ్, గ్రామ నాయకులు ఖాసీం, హనుమప్ప, గాదిరెడ్డి, యంకన్న పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు తీసుకోకపోతే ఎలా?

ఆదోని అర్బన్: వర్షాల నేపథ్యంలో అధికారులు పట్టణంలో ముందస్తు చర్యలు తీసుకోకపోతే ఎలా అని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ప్రశ్నించారు. బుధవారం ఆదోని పట్టణంలో జలమయమైన కాలనీలను ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షం వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయని, చాలా కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరాయన్నారు. నీటిని తొలగించేందుకు మున్సిపల్ అధికారులు గ్రామికులను సిద్ధంగా ఉంచారని, ఇబ్బంది పడుతున్న ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే అధికారులు స్పందించి ఇళ్లల్లోని నీటిని బయటికి తోడేసేందుకు రెడీగా ఉన్నారన్నారు. అలాగే ఇళ్లలోకి నీరు చేరడం వల్ల రేషన్ పాడైపోయిన వారికి ప్రభుతవ ద్వారా రేషన్ అందిస్తామన్నారు. మున్సిపల్ ఇంజనీర్ సత్యనారాయణ, డీఈలు రామ్మూర్తి, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ ప్రాంగణంలోని టవర్‌ను తొలగించాలి

ఆదోని రూరల్: స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సెల్ టవర్‌ను వెంటనే తొలగించాలని పీడీఎస్‌ఓ రాష్ట్ర నాయకుడు తిరుమలేష్, డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధణాపురం ఉదయ్, ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలు డిమాండ్ చేశారు. బుధవారం కళాశాల వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు షకీల్, వినీల్, రాజ్‌కుమార్, నవీన్, వినోద్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాన్ని పునః మూల్యాంకనం చేసుకోవాలి

ఆదోని రూరల్: కొంతమంది దివ్యాంగుల పెన్షన్లు సాంకేతిక సమస్యల వల్ల ఆగిపోయాయని ఆదోని డివిజన్ అభివృద్ధి అధికారి బాలకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పింఛన్ రాని వారు కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య ధ్రువీకరణ పత్రాన్ని పునః మూల్యాంకనం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈనెల 6వ తేదీ నుంచి ప్రాజెక్టు డైరెక్టర్ డీఆర్‌డీఏ వారు ఎంపీడీలకు క్యాంపు వివరాలను పంపడం జరిగిందన్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ నిర్ణయించిన తేదీల్లో పింఛన్ లబ్ధిదారులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వెళ్లి రిపోర్టు చేసుకోవాలని సూచించారు.

చేనేత దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో గురువారం ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ చేనేత దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘ తాలూకా కార్యదర్శి కాలప్ప పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేతలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నందవరం : మండల కేంద్రంలోని రామమ్మ దేవాలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శేఖర్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని సోమలగూడూరు గ్రామానికి చెందిన శేఖర్ బుధవారం నందవరం గ్రామంలో వివాహానికి హాజరై స్వగ్రామానికి బైక్‌పై తిరుగుపయనమయ్యాడు. గ్రామ సమీపంలోని రామమ్మ దేవాలయం సమీపంలోకి రాగానే నందవరం వైపు వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అనంతరం 108 అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి డాక్టర్లు రెఫర్ చేశారు. అతని పరిస్థితి విషమయంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

రన్నింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మంత్రాలయం రూరల్ : కర్ణాటకలోని బళ్లారి జిందాల్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో చేపట్టిన అంతర్జాతీయ పరుగు పందెం పోటీల్లో రచ్చుమర్రి మోడల్ స్కూలు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సీనియర్ విభాగంలో 5కి.మీ. పరుగు పందెంలో సీఈసీ విద్యార్థి కె.భాస్కర్, జూనియర్ విభాగంలో 5 కి.మీ. పరుగు పోటీలో సీఈసీ విద్యార్థి దినేష్ నిరీత సమయంలో మార్క్‌ను చేరుకున్నారు. అంతర్జాతీయ స్థాయి పోటీలో విద్యార్థులు రాణించడంతో పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్‌నాయక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు షరీఫ్ వలితోపాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉన్నతంగా ఎదగాలి

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థి బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. బీసీ బాలికల వసతి గృహంలో ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువుకోవాలన్నారు. పట్టణ వాసులు స్పందించి వసతి గృహాలకు సౌకర్యవంతమైన భవనాలు ఇస్తే ఎంతో మంది నిరుపేదలకు చేయుతనందించిన వారవుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి ప్రసూన, సహాయ సంక్షేమ అధికారి శ్రీనివాసులు, వార్డెన్ ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలకు పుట్టినిల్లు 'ఎమ్మిగనూరు'

- నేత వస్త్రాల మార్కెటింగ్‌కు ప్రత్యేక యాప్‌ను ప్రారంభించనున్న బుట్టా ఫౌండేషన్

ఎమ్మిగనూరు టౌన్: పద్మశ్రీ మాచాని సోమప్ప నేతృత్వంలో ఎమ్మిగనూరు చేనేత వస్త్రాల తయారీకి పుట్టినిల్లుగా పేరొందింది. పట్టణ జనాభాలో అత్యధిక శాతం వున్న చేనేతల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు 1938లో మాచాని సోమప్ప పట్టణంలో వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీని స్థాపించారు. నేత కార్మికులకు ముడి సరుకులు సరఫరా చేస్తూ జనతా, చేనేత వస్త్రాల తయారీకి ప్రోత్సాహన్నందించి ఇక్కడి చేనేతలకు గుర్తింపు తీసుకొచ్చారు. ఇక్కడ తయారు చేసిన నేత వస్త్రాలను దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో విక్రయించేలా అవుట్‌లెట్‌లను ఏర్పాటు చేశారు. నాడు స్థాపించిన సొసైటీ ద్వారా స్థానికంగా దాదాపు 3వేల మంది, జిల్లాలో 15వేల మంది వరకు ఉపాధి పొందుతుండటం విశేషం. అప్పట్లో ప్రారంభించిన స్పిన్నింగ్ మిల్లులో వెయ్యి మందికి పైగా ఉపాధి లభించింది. ఆయన తదనంతరం చేనేత రంగాన్ని పట్టించుకొనే నాథుడు కరువై స్పిన్నింగ్ మిల్లు మూతపడటంతో పాటు చేనేత కార్మికులకు ముడి సరుకు అందక చాలా మంది నేత కార్మికులు వృత్తికి దూరమయ్యారు.

చేనేతలకు ఆదుకునేందుకు బుట్టా ఫౌండేషన్ శ్రీకారం

నియోజకవర్గంలోని చేనేత కార్మికులను ఆదుకునేందుకు పార్టీలకు అతీతంగా వైఎస్ఆర్‌సీపీ నియోజవర్గ ఇన్‌చార్జి బుట్టారేణుక, ఫౌండేషన్ అధినేత బుట్టా శివనీలకంఠలు బుట్టాఫౌండేషన్ ద్వారా శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా చేనేత కార్మికులు తయారు చేసే వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు వినూత్నంగా ఓ యాప్‌ను రూపొందించారు. 'ఎమ్మిగనూరు హెరిటేజ్ లూమ్స్ గ్లోబో' అనే యాప్ ద్వారా దేశ వ్యాప్తంగా చేనేత వస్త్రాలను మార్కెటింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. ఈయాప్‌ను పట్టణంలోని మచాని సోమప్ప మెమోరియల్ హల్‌లో జాతీయ చేనేత దినోత్సవం రోజైన గురువారం చేనేతలతో కలిసి లాంఛనంగా ప్రారంభించనున్నారు.

పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలి



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న డీఎస్పీ భార్గవి

నందవరం : మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తనిఖీ పటిష్టంగా చేపట్టాలని డీఎస్పీ ఎంఎన్ భార్గవి ఆదేశించారు. బుధవారం గ్రామంలోని చెక్‌పోస్టును డీఎస్పీ తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద పోలీసుల భద్రత, రవాణా తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ కేశవ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కంటి చూపు లేకపోతే జీవితం శూన్యమే

ఎమ్మిగనూరురూరల్: మనిషికి కంటి చూపు లేకపోతే జీవితం శూన్యమేనని డీఎస్పీ ఎం.ఎస్. భార్గవి అన్నారు. స్థానిక ఆర్కే కంటి వైద్యశాలలో జూలై నెలలో 70 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు జరిగాయి. బుధవారం ఆర్కే కంటి వైద్యశాల డాక్టర్ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారికి ఉచితంగా మందులను డీఎస్పీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. టౌన్ సీఐ వి. శ్రీనివాసులు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు నటరాజ్‌రెడ్డి, కార్యదర్శి సుధాకర్‌రావు, డాక్టర్ గణేష్, మేనిజింగ్ డైరెక్టర్ అనురాధ, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కుళాయి కనెక్షనే లేదు.. బిల్లు కట్టాలట!

ఆదోని టౌన్: తన పేర కుళాయి కనెక్షన్ లేకున్నా పట్టణంలోని అరుంజ్యోతినగర్‌లో తన పేరిట కుళాయి కనెక్షన్ ఉన్నట్లు చూపుతూ రూ.5 వేలు నీటి పన్ను చెల్లించాలని అధికారులు డిమాండ్ నోటీసు పంపారని బాధితుడు గోవిందరాజులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏడాది కాలంగా మున్సిపల్ కార్యాలయం అధికారుల చుట్టూ తిరుగుతున్నా తన గోడును ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. తన పేర చూపుతున్న కుళాయి కనెక్షన్‌ను పూర్తిగా తొలగించి, కొత్త కుళాయి కనెక్షన్ మంజూరు చేయాలని అధికారులను వేడుకున్నా పట్టించుకోవడం లేదని వాపోయాడు. మున్సిపల్ అధికారులు తనకు న్యాయం చేయాలని కోరాడు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన ఉండాలి

ఆదోని సెంట్రల్: సైబర్ సెక్యూరిటీ వంటి అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీటీ ఫౌండేషన్‌కు చెందిన అమిత్ రాజ్ కర్మాకర్ తెలిపారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మూడు రోజులు పాటు సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం బుధవారం ముగిసింది. కళాశాల కరస్పాండెంట్ దైవాదీనం రెడ్డి , కళాశాల చైర్మన్ విట్టా సతీష్, ప్రిన్సిపాల్ మురళీ మోహన్, వైస్ ప్రిన్సిపాల్ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

12న మత్స్యశాఖ వాహనం వేలం

గోనెగండ్ల : స్థానిక మత్స్యశాఖ కార్యాలయానికి సంబంధించిన మహీంద్రా వ్యాన్ (2005 మోడల్) ను వేలం వేస్తున్నట్లు మత్స్యశాఖ ఇన్‌చార్జ్ ఎఫ్ డీఓ నాగరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న ఉదయం 11 గంటలకు గాజులదిన్నె ప్రాజెక్టు లోని కార్యాలయంలో వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.5వేలు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 83097 76847 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

క్షయవ్యాధిని పారదోలుదాం

ఆదోని టౌన్: జాగ్రత్తలు పాటిద్దాం... టీబీని దేశం నుంచి పారదోలుదామని మెడికల్ ఆఫీసర్ పృథ్వీ రాజ్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని 22వ వార్డు ప్రకాష్‌నగర్‌లో క్షయ వ్యాధి నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. కాలనీలో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్లు బాబు రాజు, సీతారాముడు, మేరీ అరుణ, సుబ్బమ్మబాయి పాల్గొన్నారు.